క్లుప్తంగా

శివోహం.. దేదీప్యం



నాగుల చెరువులో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: వివేకానంద స్వచ్ఛంద సేవా సమితి అనుబంధ గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నాగులచెరువు రామాలయం వద్ద కార్తిక దీపారాధన ఆధ్యాత్మిక పరవశంతో సాగింది. శివపార్వతుల రంగుల చిత్రాన్ని దీపాలతో అలంకరించిన దృశ్యం ఆకట్టుకుంది. సంస్థ ప్రతినిధి అజయ్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహ మహోత్సవాలు



ఆర్యావటం రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో సప్తాహ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్త కమిటీ సభ్యులు ఐదు రోజుల క్రితం స్థానిక రామాలయంలో కలశ స్థాపన చేసి, కార్యక్రమాలు ప్రారంభించారు. నాటి నుంచి నిర్విరామంగా భజన కార్యక్రమాలు కొనసాగించటంతో పాటు ప్రతిరోజు రాత్రి ఆవునెయ్యితో జ్యోతిర్లింగార్చనలు, కుంకుమపూజలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 25వ తేదీతో సప్తాహ కార్యక్రమం పూర్తవుతుందని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

హైస్కూల్‌కు వంట పాత్రల అందజేత



నిర్వాహకులకు వంట పాత్రలు అందిస్తున్న సర్పంచ్ సాయి

కె.గంగవరం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కె.గంగవరం ఉన్నత పాఠశాలకు గురువారం వంటపాత్రలను అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన ఈ వంట పాత్రలను సర్పంచ్ అనుసూరి సాయి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల ఆరోగ్యం కోసం జగనన్న గోరు ముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



ద్రాక్షారామలో స్కూల్ బస్, ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై సురేంద్ర

రామచంద్రపురం రూరల్: పాఠశాలలకు విద్యార్థులను చేరవేసే స్కూల్ బస్, ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆటో ప్రమాదంలో స్కూలు విద్యార్థులు గాయపడిన సంఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ద్రాక్షారామ, పరిసర గ్రామాల స్కూల్ బస్, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను సురక్షితంగా చేర్చాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

'టీడీపీ భజనా శంఖారావం అది'

కపిలేశ్వరపురం (మండపేట): కొత్తపేటలో దళిత శంఖారావం పేరుతో ఇటీవల నిర్వహించిన కార్యక్రమం టీడీపీ భజనా శంఖారావంలా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయరాజు అన్నారు. మండపేట పట్టణంలోని మహాజన సోషలిస్టు పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దళిత శంఖారావంలో మాట్లాడిన వారు దళిత సమస్యలను విస్మరించి టీడీపీ నాయకుల భజన చేశారన్నారు. దళితులపై జరుగుతున్న దమన కాండను ఏ మాత్రం సమావేశంలో చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధినాయకులు చంద్రబాబు, లోకేష్‌లను ఇంద్రుడు, చంద్రుడంటూ పొగడ్తలతో ముంచెత్తడానికి నిర్వహించిన సభగా అభివర్ణించారు. మాదిగ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి రాజకీయ ప్రాధాన్యం ఎలా పెంచగలరో చెప్పి ఉంటే సంతోషించేవారమన్నారు. కొత్తపేట శంఖారావం కేవలం రానున్న ఎన్నికల జిమ్ముక్కులో భాగంగా అనిపించిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రానున్న ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి టీడీపీ ఏపాటి రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తుందో ఇప్పటికైనా తేల్చాలని జయరాజు డిమాండ్ చేశారు.

అవగాహనే ఆయుధం

- కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి కృషి
- క్షేత్ర స్థాయిలో బాధితుల గుర్తింపు
- చికిత్స విధానాలపై అవగాహన



పడమర ఖండ్రిక పాఠశాలలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: అవగాహన ఉంటే ఏ పనినైనా సులువుగా చేయవచ్చు.. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎదుర్కోవచ్చు.. అలాగే ఆరోగ్య సమస్య వస్తే చైతన్యవంతంగా ముందుకు సాగితే ఎలాంటి దానినైనా అంతమొందించవచ్చు.. అలాంటి ప్రయత్నంలో భాగంగా కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాయి. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే లక్ష్యంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాయి. దానికి అనుగుణంగా చికిత్స విధానాలపై రోగులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకువస్తున్నాయి.

ఎక్కడెక్కడ.. ఎంతమంది..

మండపేట నియోజకవర్గంలో 86, రామచంద్రపురం నియోజకవర్గంలో 129 మంది మొత్తం 215 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులున్నారు. కాజులూరు మండలం దుగ్గుదూరు పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు, గొల్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో 22 మంది, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 28, ద్రాక్షారామ పీహెచ్‌సీలో 26, వెల్ల పీహెచ్‌సీలో 24. కె.గంగవరం మండలం పామర్రు పీహెచ్‌సీలో 24, మండపేట అర్బన్ పీహెచ్‌సీలో 22, కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీలో 28, అచ్యుతాపురం 18, అంగర 18, ఆలమూరు మండలం పెదపళ్లలో 15, చొప్పెళ్ల పీహెచ్‌సీ పరిధిలో 16 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు.

ఇంటింటా సర్వే

ఇంకా లెప్రసీ కేసుల గుర్తింపునకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. చిన్నారుల శరీరాలను పరీక్షించి మచ్చలున్నట్టయితే నిపుణులకు నివేదిస్తున్నారు. ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరిస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, డివిజన్ స్థాయిలో డీపీఎంఓ స్థాయీ అధికారి షెడ్యూల్ ప్రకారం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

లక్షణాలను బట్టి చికిత్స

మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సలు ఉన్నాయి. వ్యాధిగ్రస్తులు మానసికంగా ధృడంగా ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతి పీహెచ్‌సీలో ప్రతి నెలా 10న, రామచంద్రపురంలోని రెండు లెప్రసీ కాలనీల్లో 11న చికిత్స చేస్తారు. పుండ్లు ఉన్నవారికి అవసరాన్ని బట్టి కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్రచికిత్స అందిస్తారు. చేయించుకున్న వారికి రూ.8 వేల పారితోషికాన్ని కూడా ఇస్తారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.3 వేల పింఛను, నెలకు 35 కిలోల బియ్యం అందిస్తుంది.

> **అపోహలు వీడాలి**
>
> 
>
> కుష్ఠు వ్యాధి పట్ల అపోహలు వీడాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. పాఠశాలలు, క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నాం. కుష్ఠు వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు. ప్రభుత్వం క్రమం తప్పకుండా సర్వే, చికిత్స, సాయాన్ని అందిస్తుంది.
>
> –జుత్తుక మల్లిఖార్జునరావు, ఎంపీహెచ్ఈఓ, అంగర పీహెచ్‌సీ

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

రాయవరం: పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రాయవరం, వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమలకుమారి మాట్లాడుతూ తరగతిలో చదువుతున్న వెనుకబడిన విద్యార్థులను కూడా మెయిన్ స్ట్రీమ్‌లోకి తీసుకురావాలన్నారు. పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. విద్యార్థుల పుస్తకాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, తప్పులను సరిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు డైరీలు, లెసన్ ప్లాన్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. లెర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించి హెచ్ఎంలు వీఎస్ సునీత, పోలిశెట్టి రాంబాబు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. బుద్దవరపు చారిటబుల్ ట్రస్ట్ నుంచి సరఫరా అవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఆహారం రుచికరంగా ఉందా? లేదా? అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని అందించే విధంగా ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆమె వెంట డీఈఓ కార్యాలయ ఏడీ నక్కా సురేష్, సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు, ఎంఈఓలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ ఉన్నారు.

పుంత రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



అర్తమూరులో పుంత రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పాపారాయుడు తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరులో పుంత రహదారుల నిర్మాణానికి గురువారం ఎంపీపీ వుండమట్ల వాసు, జెడ్పీటీసీ కుడిపూడి భవానీ శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ 25 ఏళ్లుగా గ్రామాల్లో పుంత రహదారులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. రహదారుల నిర్మాణాలు, గ్రామాభివృద్ధికి ఎమెల్సీ తోట త్రిమూర్తులు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు శ్రీదేవి, ఏడిద సీతానగరం, అర్తమూరు గ్రామాలకు చెందిన రైతు నాయకులు కాయల సత్తిరాజు, పంపన కనకయ్య, కర్రి సుబ్బారెడ్డి, చిర్ల బాబుల్ రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కర్రి సత్యం, పడాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే సంక్షేమాభివృద్ధి



భట్లపాలికలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగమణి, పెట్టా శ్రీనివాస్ తదితరులు

కె.గంగవరం: పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని, ఆయన పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి మెరుగవుతుందని ఎంపీపీ పంపన నాగమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా భట్లపాలిక గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఈఓపీఆర్డీ నాగేంద్ర, సర్పంచ్ యలమంచిలి పద్మావతితో కలసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీనివాస్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా సభ్యులు బత్తుల అప్పారావు, కన్వీనర్ కట్టా తిరుమల, యలమంచిలి సత్యనారాయణ, సరాల శ్రీను, సొసైటీ అధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ, మోర్త శ్రీహరి, మేడిశెట్టి అర్జునరావు, బొక్కా భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



వి.సావరం బాణసంచా తయారీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

రాయవరం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కార్మిక సంక్షేమ, విద్యాశాఖ, పోలీసులు సంయుక్తంగా గురువారం రాయవరం మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రాజోలు ఏఎల్ఓ జి.సత్యనారాయణ, రాజమహేంద్రవరం ఏఎల్ఓ ఎ.విజయప్రకాష్, సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబులు మండలంలోని సోమేశ్వరం, రాయవరం, వి.సావరం గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వ్యాపార సముదాయాలు, దుకాణాలు, బాణసంచా తయారీ కేంద్రాలు, ఇటుక బట్టీల్లో తనిఖీలు చేపట్టి, బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నారా? అనే విషయాన్ని పరిశీలించారు. 18 ఏళ్ల లోపు వారితో పనిచేయిస్తే బాలకార్మిక నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు వ్యాపార సముదాయాల యజమానులకు తెలిపారు. బాల కార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో వచ్చే నెల 8వ తేదీ వరకూ ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి అవిరళ కృషి

- ప్రభుత్వ సహకారంతో పల్లెల ప్రగతి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కపిలేశ్వరపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



పడమర ఖండ్రికలో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కపిలేశ్వరపురం: ప్రభుత్వ సహకారంతో పల్లెల ప్రగతికి అవిరళ కృషి చేస్తున్నామని, ఏ సమస్య వచ్చినా ప్రజలు తనను సంప్రదిస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం కపిలేశ్వరపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్యాస్ కంపెనీ, పాత అగ్రహారం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారం, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామస్తులకు కుటుంబాల వారీగా ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రభుత్వ లబ్ధి అందని వారెవరున్నా తన దృష్టికి తీసుకొస్తే మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు. అనంతరం సచివాలయం-1 భవనం, దివాణం వద్ద సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. సచివాలయం-2 వద్ద వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి చిరునామా పడమర ఖండ్రిక

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు చిరునామాగా పడమర ఖండ్రిక గ్రామం నిలుస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ఎస్సీపేటలో కమ్యూనిటీ హాల్, జగనన్న కాలనీలో వెల్‌నెస్ సెంటర్‌లను ఆయన ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు తిరునాతి వెంకటేశ్వరరావు దంపతులను అభినందించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు కవల శ్రీను, తిరునాతి వెంకటేశ్వరరావు, దళిత నాయకులు పాలింగి కృష్ణకిశోర్, శ్రీనివాస్, నేల సూర్యకుమార్, వంగా నల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జనార్దనస్వామి తెప్పోత్సవం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో శ్రీదేవి భూదేవీ సమేత జనార్దనస్వామివారి తెప్పోత్సవం శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశి నేపథ్యంలో పాటిమీద అంకసాని చెరువులో సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు



గొల్లపాలెంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న భక్తులు



ద్రాక్షారామలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పుట్టపర్తి సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వేకువజామున నగరకీర్తన, భజన కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన, అనంతరం సుమారు 300 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా ధనరాజు, సభ్యులు స్వామివారి పాదుకలను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ద్రాక్షారామలో...

రామచంద్రపురం రూరల్: సత్యసాయి జన్మదిన వేడుకలను ద్రాక్షారామ సత్యసాయి నిలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, అష్టోత్తర పూజలు జరిగాయి. 98 మంది వృద్ధులకు వస్త్రదానం చేశారు. చిన్నారులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి, రాజారావు, పాపాజీ, పెన్నాడ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

రామచంద్రపురం: పట్టణంలోని స్థానిక రైస్‌పేట పార్కు వద్ద పుట్టపర్తి సాయిబాబా ఆలయంలో గురువారం సత్యసాయి జన్మదినాన్ని పురస్కరించుకుని వంద మంది వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చెల్లూరుకు చెందిన కోలాటం బృందంవారు కోలాట ప్రదర్శన చేశారు. సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతులు, నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, గొల్లపల్లి కృష్ణ, నారపరెడ్డి బలరాం, ప్రముఖ గాయకుడు అక్కిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ

- సీఎం జగన్‌తోనే సాకారం
- గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



వెదురుపాకలో పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సూరారెడ్డి తదితరులు



అర్తమూరులో ప్రభుత్వ కృషిని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో మన రాష్ట్రం సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. గురువారం వెదురుపాకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే జనవరి నుంచి సామాజిక పింఛన్ రూ.2,750 నుంచి రూ.3 వేలకు చేరుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిజిటల్ బోర్డును సర్పంచ్ సూరారెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ దంతుర్తి సుబ్రహ్మణ్యశర్మ, దేవాలయ చైర్మన్ తాడి బులివెంకటరెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, టేకుమూడి రాంబాబు, మండల సేవాదళ్ కమిటీ కన్వీనర్ వెలగల సత్యనారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అర్తమూరులో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో వక్తలన్నారు. సచివాలయం-1 వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, నాయకులు భాస్కరరెడ్డి, ఎంపీపీ వుండమట్ల వాసు, జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీటీసీ సభ్యులు మండ సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబులు కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరామ్, నాయకులు గొలుగురి సందీప్ రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ మండ వెంకటరెడ్డి, తేతలి భూపాలిరెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వడ్లమూరులో సర్పంచ్ చుండ్రు మంగమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ పలివెల మధు, సచివాలయ కన్వీనర్ రెడ్డి రుద్రమూర్తి మాట్లాడారు. కాలేరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుత్సకాయల రామారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

బాలబాలాజీ స్వామికి లక్ష తులసి పూజ



అప్పనపల్లి బాలాజీ స్వామికి లక్ష తులసి పూజ చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి గురువారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు వివిధ పూజలతో పాటు అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామివారికి రాజభోగ నివేదన, సాయం కాలార్చన, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు జరిపించారు. లక్ష తులసి పూజలో 320 మంది భక్తులు కర్తలుగా పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, విజయగంగారత్నం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మలికిపురం: కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం లక్ష తులసి పూజను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వి.హరప్రసాద్ రాజు ఆధ్వర్యంలో, ఆలయ అర్చకుడు కిలాంబి కృష్ణమాచార్యులు నేతృత్వంలో అర్చకస్వాములు పూజా కార్యక్రమం జరిపించారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం

రామచంద్రపురం రూరల్: మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన దిశ చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దిశ మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి అన్నారు. ద్రాక్షారామ ఎస్వీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు, ముస్లిం కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, దిశ యాప్, చైల్డ్ పోర్నోగ్రఫీ, ఫోక్సో చట్టం, సైబర్ క్రైమ్ తదితర అంశాలను వివరించారు.

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం



విజేతకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి తదితరులు

రాయవరం: విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని పలువురు ప్రముఖులు అన్నారు. లొల్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. చాట్రాతి వీరవెంకట సత్యసాయి చైతన్య చౌదరి జ్ఞాపకార్థం విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పారిశ్రామికవేత్త కంటిపూడి సర్వారాయుడు, వైద్యులు జీఎస్ఎన్ రెడ్డి, గోపిరవితేజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. చైతన్యచౌదరి పేరిట ఏటా పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తండ్రి రాంబాబును అభినందించారు. సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు కోట వెంకట్రావు, కత్తుల అప్పారావు, పంచాయతీ ఈఓ మందపల్లి భాస్కరరావు, రిటైర్డ్ టీచర్ పాతూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.